

మూడింతల పరిహారం

భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం మూడింతల పరిహారం చెల్లిస్తుందని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. 8లో▸



బాలికల సంరక్షణ కోసం

బాలికా శిశు సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి పేర్కొన్నారు. 8లో▸



అతివేగమే ప్రాణాలు తీసింది

బొంగ్లూర్ ఓఆర్ఆర్‌పై ప్రమాదంలో అతివేగమే ఐదుగురు ప్రాణాలు తీసిందని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. 8లో▸

న్యూస్‌రీల్

అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఇంగ్లిష్, సెరికల్చర్, తెలుగు, జువాలజీ బోధించే పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు ఆసక్తి గల వారు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు పీజీలో సంబంధిత సబ్జెక్టుల్లో 50శాతం, ఇతరులు 55శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని చెప్పారు. పీహెచ్‌డీ, ఎన్‌టీపీ, సెట్, ఎస్‌ఎల్ఈటీ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. హయత్‌నగర్‌లోని డిగ్రీ కళాశాలలో ఈనెల 24న మౌఖిక పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఖాళీల భర్తీకి దరఖాస్తు చేసుకోండి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాధిక శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్‌సైన్స్ అప్లికేషన్లు–2, ఇంగ్లిష్–1, డెయిరీసైన్స్–1, క్రాప్‌ప్రొడక్షన్–1 మొత్తం ఐదు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. పీజీలో జనరల్ అభ్యర్థులు 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ కలిగిన వారికి, బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 23 సాయంత్రం 4 గంటలలోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ, పీజీ కళాశాలలో మిగిలి ఉన్న ఎస్టీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న గిరిజన విద్యార్థినులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బీకాం (కంప్యూటర్ సైన్స్), ఎంపీసీఎస్, బీజెడ్సీ, ఎంజెడ్సీ, ఎంపీసీ, ఐఎంఎస్సీ (ఇంటిగ్రేటెడ్ పీజీ) కోర్సులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 98850 03390, 97034 41345, 63050 51490 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

ఫీజు దోపిడీని అరికట్టాలి

షాద్‌నగర్: ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించాలని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ మేరకు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23న విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు సామేర్, శివశంకర్, కార్తీక్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల జిల్లా సదస్సును జయప్రదం చేయండి



దివ్యాంగులతో సమావేశమైన జంగయ్య

కడ్తాల్: ఆమనగల్లులో ఈనెల 21న జరిగే దివ్యాంగుల, చేయూత పెన్షన్‌దారుల జిల్లాస్థాయి సన్నాహక సదస్సును జయప్రదం చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం దివ్యాంగులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలు, చేయూత ఆసరా పెన్షన్ రూ.4 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లులో జరిగే సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు జంగయ్య, మండల అధ్యక్షుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

హర్షపాతం



చేవెళ్ల: ఆలూరులో పంటకు ఎరువు పిచికారీ చేస్తున్న రైతు

జిల్లాలో రెండు రోజులుగా భారీ వర్షాలు

- రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

తుర్కయంజాల్: వర్షాకాలం ప్రారంభమై 50 రోజులు గడుస్తున్నా ఆశించిన మేర వర్షాలు లేక ఆకాశం కేసి ఎదురుచూసిన అన్నదాతలకు ఉపశమనం లభించింది. వాయుగుండం ప్రభావంతో జిల్లాలోని పలు చోట్ల రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆయా మండలాల్లో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదవుతోంది. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి. అనేక చోట్ల చెరువులు ఉప్పొంగి, వాగులు వంకలు ప్రవహిస్తున్నాయి.

మంచాలలో అధికంగా..

మంచాల మండలంలో సాధారణంగా 155.1 మి.మీ కాగా 242.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక్కడ 56 శాతం అధికంగా వర్షం కురిసింది. షాబాద్‌లో 54 శాతం, యాచారంలో 41 శాతం, మాడ్గులలో 39 శాతం, ఫరూఖ్‌నగర్‌లో 36 శాతం, ఆమనగల్లులో 21 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది.

రైతుల ఆనందం

వర్షాధార పంటలు సాగు చేసిన రైతులు వరుణుడి కరుణ కోసం నిరీక్షిస్తున్నారు. ఈ నెల 18వ తేదీ వరకు 9 మండలాల్లో లోటు వర్షపాతం ఉండగా శుక్ర, శనివారం కురిసిన భారీ వర్షాలతో శంకర్‌పల్లి, శేరిలింగంపల్లి, సరూర్‌నగర్, చేవెళ్లలో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటలకు జీవం వచ్చిందని చెబుతున్నారు

ఆ మండలాల్లో ఇంకా లోటే..

కొన్ని మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదవుతున్నా మరి కొన్నిచోట్ల ఇప్పటికీ లోటు వర్షపాతమే ఉంది. గండిపేటలో –52 శాతం, రాజేంద్రనగర్‌లో –21 శాతం, హయత్‌నగర్‌లో –36 శాతం, అబ్దుల్లాపూర్‌మెట్‌లో –20 శాతం, కొందుర్గులో –34 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

మండలాల వారీగా నమోదైన వర్షపాతం (మిల్లీమీటర్లలో)

మండలం	కురిసింది	సాధారణం
శంకర్‌పల్లి	168.6	207.3
శేరిలింగంపల్లి	208.8	211.6
గండిపేట	100.5	208.5
రాజేంద్రనగర్	169.9	214.7
బాలాపూర్	207.8	191.6
సరూర్‌నగర్	157.7	192.9
హయత్‌నగర్	125.6	196.0
అబ్దుల్లాపూర్‌మెట్	154.8	192.9
ఇబ్రహీంపట్నం	225.4	169.7
మంచాల	242.2	155.1
యాచారం	228.2	162.1
మాడ్గుల	206.8	149.0
ఆమనగల్లు	209.4	172.9
తలకొండపల్లి	209.9	153.2
కేశంపేట	197.9	162.2
కడ్తాల్	157.4	151.2
కందుకూరు	187.7	172.9
మహేశ్వరం	253.1	187.6
శంషాబాద్	257.4	221.4
మొయినాబాద్	207.8	180.4
చేవెళ్ల	245.9	195.0
షాబాద్	271.4	175.8
కొత్తూరు	205.0	173.7
నందిగామ	197.2	182.9
ఫరూఖ్‌నగర్	248.5	182.3
కొందుర్గు	120.8	182.3
చౌదరిగూడెం	142.6	171.5
జిల్లా సరాసరి	196.6	182.1

పంటలకు ఊపిరి

చేవెళ్ల: వర్షాలు లేక రైతులు దిగాలు చెందుతున్న తరుణంలో భారీ వర్షం ఊరటనిచ్చింది. పత్తి, మొక్కజొన్న, కంది పంటలకు ఊపిరిపోసినట్లు అయింది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో రైతులు శనివారం ఉదయం సంతోషంగా పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ఎరువులు, మందులు పిచికారీ చేయడంలో బిజీగా మారారు.





జంట జలాశయాలకు భారీ వరద

హిమయత్‌సాగర్ జలాశయం

సాక్షి, సిటీబ్యూరో: జంట జలాశయాలకు భారీ స్థాయిలో వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లకు వరద ప్రవాహం పెరిగింది. ఉస్మాన్‌సాగర్ జలాశయంలోకి పరీవాహక ప్రాంతాలైన చేవెళ్ల, వికారాబాద్, శంకర్‌పల్లి, దోబీపేట్ ప్రాంతాల్లోని వర్షపు నీరు మూసీ నది ద్వారా వచ్చి చేరుతోంది. హిమాయత్‌సాగర్ రిజర్వాయర్‌కు చేవెళ్ల, అమ్డాపూర్, కొత్వాల్‌పేట్, నర్కూడ, తాండూరు, మొయినాబాద్ తదితర ప్రాంతాల్లో కురిసే వర్షం నీరు ఈసీ నది ద్వారా చేరుతోంది. శనివారం కూడా భారీ వర్షం కురవడంతో జంట జలాశయాలకు వరద ప్రవాహం పెరిగింది. జలమండలి అధికారులు వరద ఉధృతిని పరిశీలిస్తున్నారు.

ఉస్మాన్‌సాగర్
పూర్తి స్థాయి నీటి మట్టం: 1,790 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం: 1782.75 అడుగులు
ఇన్‌ఫ్లో: 1,200 క్యూసెక్కులు
మొత్తం గేట్లు: 15

హిమాయత్‌సాగర్
పూర్తి స్థాయి నీటి మట్టం : 1,763.50 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం : 1,759.10 అడుగులు
ఇన్‌ఫ్లో : 1,300 క్యూసెక్కులు
మొత్తం గేట్లు : 17

జీవం పోసింది



నాకున్న మూడు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. ఖరీఫ్ మొదట్లో వర్షాలు కురిసినప్పుడు పంట వేశాను. విత్తనాలు మొలకెత్తిన తరువాత వర్షాలు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడులు పోయాయని అనుకున్నాను. నెలరోజులకుపైగా వర్షాలు లేకపోవటంతో పంట వాడిపోయే దశకు వచ్చింది. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో పంటలకు జీవం పోసినట్లు అయింది. పంటకు ఎరువులు, మందుల పిచికారీ చేసుకుంటున్నాను.

– శ్రీశైలం, రైతు, రామన్నగూడ

మొలకలకు ప్రాణమొచ్చింది




నెల రోజుల నుంచి వర్షాలకోసం ఎదురుచూస్తున్నాం. మొదట్లో రోహిణి కార్తెలోనే వర్షాలు పడడంతో పత్తి విత్తనాలు నాటాం. అవి మొలకెత్తే సమయంలో వర్షాలు పడలేదు. నెలరోజుల నుంచి వానలు లేక ఎండిపోతాయనుకున్నాం. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో మొలకలకు ప్రాణమొచ్చింది. వాగులు పారడంతో వరినాట్లు వేయడానికి కరిగెట్లు సిద్ధం చేస్తున్నాం.

– బంటు జంగయ్య, రైతు, నక్కలపల్లి, మొయినాబాద్ మండలం

ఫ్యూచర్ సిటీ.. ప్రొసీడింగ్స్ పిటీ

ఎఫ్‌సీడీఏ, హెచ్‌ఎండీఏల మధ్య కొరవడిన సమన్వయం

- హెచ్‌ఎండీఏలోనే ఫ్యూచర్ సిటీ ఫైళ్ల పరిశీలన
- రెండు సంస్థల చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు



సాక్షి, సిటీబ్యూరో: ఫ్యూచర్‌సిటీలో లే అవుట్‌లు, భవన నిర్మాణ అనుమతుల్లో గందరగోళం నెలకొంది. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా హెచ్‌ఎండీఏ తరహాలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ)ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ సంస్థకు ప్రత్యేక యంత్రాంగాన్ని కూడా నియమించారు. అయినా.. ఎఫ్‌సీడీఏలో ఇప్పటి వరకు నిర్మాణరంగానికి సంబంధించిన అనుమతుల ప్రక్రియ గాడిలో పడలేదు. దీంతో భవన యజమానులు, రియల్టర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పరిశీలన దశలోనే..

ఎఫ్‌సీడీఏలో సిబ్బంది కొరత కారణంగా లేఅవుట్‌లు, బిల్డింగ్‌ల నిర్మాణం కోసం వచ్చే దరఖాస్తులన్నింటినీ హెచ్‌ఎండీఏ స్వీకరించి పరిష్కరిస్తుంది. అంతిమంగా ప్రొసీడింగ్‌లు (అనుమతులు) మాత్రం ఎఫ్‌సీడీఏ నుంచి లభిస్తాయి. కానీ ఈ ప్రక్రియ ఇంకా స్థిరంగా కొనసాగడం లేదు. వందల కొద్దీ దరఖాస్తులు పరిశీలన దశలోనే ఉన్నాయి. గతంలో డీటీసీపీ వద్ద నమోదైన వాటిని సైతం ప్రస్తుతం హెచ్‌ఎండీఏకు బదిలీ చేశారు. ట్రిపుల్ ఆర్ వరకు హెచ్‌ఎండీఏ పరిధికి చెందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ యథాతథంగా కొనసాగుతోంది. హెచ్‌ఎండీఏ నుంచే స్వయంగా అనుమతులు లభిస్తున్నాయి. ఫ్యూచర్ సిటీ పరిధికి చెందిన దరఖాస్తుల పరిశీలనలో మాత్రం జాప్యంనెలకొంటోంది. దీంతో నిర్మాణ సంస్థలు, రియల్ ఎస్టేట్ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టి భూములు కొనుగోలు చేసినప్పటికీ సకాలంలో అనుమతులు లభించకపోవడంతో లే అవుట్‌లను అభివృద్ధి చేయలేకపోతున్నట్లు ఎఫ్‌సీడీఏ పరిధికి చెందిన పలు నిర్మాణ సంస్థల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. కాలయాపన కారణంగా ఆర్థికంగా నష్టాలను చవిచూడాల్సి వస్తోందని పేర్కొన్నారు.

కొరవడిన సమన్వయం..

- హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) పరిధిని రీజనల్‌రింగ్ రోడ్డు వరకు విస్తరించిన సంగతి తెలిసిందే. దీంతో 7,250 చ.కి.మీల నుంచి 10,472 చ.కి.మీ వరకు హెచ్‌ఎండీఏ కార్యకలాపాలు విస్తరించాయి. 7 నుంచి 11 జిల్లాలకు ఈ పరిధి పెరిగింది. కొత్తగా 1,355 గ్రామాలు హెచ్‌ఎండీఏలో విలీనమయ్యాయి. మరోవైపు ఈ పరిధిలోనే ఉన్న 56 గ్రామాలను ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీ పరిధిలోకి తెచ్చింది. దీంతో 765 చ.కి.మీ. ప్రాంతం ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీలో భాగమైంది. గతంలో డీటీసీపీ/హెచ్‌ఎండీఏ, స్థానిక గ్రామపంచాయతీల నుంచి నిర్మాణ అనుమతులు లభించగా ఇప్పుడు అనూహ్యంగా ఈ ప్రాంతాలన్నీ అనూహ్యంగా కొన్ని పంచాయతీలు హెచ్‌ఎండీఏ, మరికొన్ని ఎఫ్‌సీడీఏ పరిధిలోకి రావడంతో గందరగోళం నెలకొంది.
- ఎఫ్‌సీడీఏకు ప్రత్యేక అధికారిని, సిబ్బందిని నియమించిన అనంతరం ప్రభుత్వం జూన్ 15 నుంచి నిర్మాణరంగ అనుమతులను అందజేసే అధికారాలను సైతం ఆ సంస్థకు అప్పగించింది. ఇంతవరకు బాగానే ఉంది. కానీ హెచ్‌ఎండీఏ తరహాలో బలమైన ప్రణాళికా విభాగం ఎఫ్‌సీడీఏకు లేదు. దీంతో బిల్డ్‌నౌ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ దశ నుంచి క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులను అందజేయడం వరకు హెచ్‌ఎండీఏ విధినిర్వహణలో భాగమైంది. అంతిమంగా ఎఫ్‌సీడీఏ నుంచి మాత్రం అధికారికంగా అనుమతులను (ప్రొసీడింగ్స్)ను అందజేస్తారు. ప్రస్తుతం ఈ రెండు సంస్థల మధ్య సరైన సమన్వయం లేకపోవడంతో కాలయాపన జరుగుతోందని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు.

సంప్రదింపులు ఎలా..

‘ఒక్క లే అవుట్ కోసం దరఖాస్తు చేస్తే ఇటు ఎఫ్‌సీడీఏ అటు హెచ్‌ఎండీఏ అధికారుల చుట్టూ పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఫైల్ ఎక్కడ ఏ దశలో ఉందో తెలియడం లేదు. హెచ్‌ఎండీఏ పని పూర్తి చేసినా చివరకు ఎఫ్‌సీడీఏను ఆశ్రయించాల్సిందే. ఇలా రెండు సంస్థల చుట్టూ తిరగడం చాలా ఇబ్బందిగా ఉంది’ అని షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన ఒక రియల్టర్ అభిప్రాయపడ్డారు. గతంలో డీటీసీపీ వద్ద అన్ని పనులు పూర్తయ్యేవి. మరో చోటికి వెళ్లాల్సిన అవసరం లేదు. కానీ.. ఇప్పుడు అలా లేదని ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రతినిధి ఒకరు చెప్పారు. కొద్ది రోజులుగా రియల్ ఎస్టేట్ రంగంలో సానుకూల వాతావరణం నెలకొని ఉంది. అనుమతుల్లో జాప్యంతో ముందుకు వెళ్లలేకపోతున్నట్లు పలువురు చెబుతున్నారు.

మోడల్ మార్కెట్‌కు సహకరించండి



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసిన ముదిరెడ్డి కోదండరెడ్డి తదితరులు

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతి

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం మండల కేంద్రంలో ఆదర్శ కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు సహకరించాలని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కమిషన్ సభ్యులు గోపాల్ రెడ్డి, భవాని తదితరులతో వెళ్లి శనివారం నగరంలోని మంత్రి కార్యాలయంలో కలిశారు. కూరగాయలు, ఆకుకూరల ఉత్పత్తిని గణనీయంగా పెంచడం కోసం రైతులను ప్రోత్సహించడానికి యాచారం మండలం మొండిగౌరెల్లి, గడ్డమల్లయ్యగూడ, చౌదర్‌పల్లి గ్రామాలను దత్తత తీసుకున్నట్లు తెలిపారు. పైలెట్ కింద గుర్తించిన గ్రామాల్లో పండే కూరగాయలను రైతులు స్థానికంగా విక్రయించుకుని లాభాలు పొందే ఉద్దేశంతో యాచారం బస్టాండ్ పక్కనే రెండు ఎకరాలు ఇవ్వడానికి అంగీకరించినట్లు వివరించారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు, విత్తనాలను అందించడం కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించి అవసరమైన నిధులు మంజూరు చేసేలా ఉన్నతాధికారులను ఆదేశిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మహిళలకు స్వయం ఉపాధి కల్పిస్తాం

మెప్మా పీడీ వెంకటేశ్వర్లు



మేళాను పరిశీలిస్తున్న మెప్మా పీడీ వెంకటేశ్వర్లు తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: మున్సిపాలిటీల్లో ఉన్న మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ నిరంతరం పని చేస్తుందని మెప్మా పీడీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శనివారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు, స్వయం ఉపాధి సంఘాల మహిళలకు స్మార్ట్ ఈషా, సంరక్షణ ఆస్పత్రుల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులతో మేళా, ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మెప్మా పీడీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో సకల సౌకర్యాలు కల్పించాలని, పేదరిక నిర్మూలన కోసం కృషి చేయాలని తెలిపారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో వంద రోజుల ప్రణాళిక ప్రత్యేకాధికారి శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది ప్రవీణ్‌గౌడ్, సాయికృష్ణారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతులను గోసపెడుతోంది




దీక్షలో పాల్గొని మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

మొయినాబాద్: ఎన్నికల ముందు రైతులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం భూములను గుంజుకుంటూ రైతులను గోసపెడుతోందని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లిలో గోశాల ఏర్పాటుతో భూములు కోల్పోతున్న రైతులు చేపడుతున్న రిలే దీక్షలో శనివారం ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు సాగుచేసుకుంటున్న భూములను గోశాలకోసం తీసుకోవడం అన్యాయమని అన్నారు. కోకాపేటలో ఉన్న గోశాలను ఎనికేపల్లికి తరలించడంతో ఎవరికి లాభం అని ప్రశ్నించారు. రైతుల భూములు గుంజుకోవడానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రభుత్వానికి సహకరిస్తున్నారని.. అంతగా గోశాల ఏర్పాటుపై ఆసక్తి ఉంటే తన సొంతగ్రామం చించోలిపేట్‌లో ఏర్పాటు చేసుకోవాలని హితవు పలికారు. ఎకరాల భూమి తీసుకుని రైతులకు గజాల్లో ఇంటి స్థలం ఇవ్వడం ఏమిటని నిలదీశారు. రైతుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నిరంజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోర నర్సింహారెడ్డి, ఓబీసీ మోర్చా నియోజకవర్గం కన్వీనర్ వెంకటేశ్‌గౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు డప్పు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎనికేపల్లి రైతులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తాం

చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ



తహసీల్దార్ కార్యాలయంలో రైతులకు పట్టాలు అందజేస్తున్న ఆర్డీఓ

మొయినాబాద్: గోశాల ఏర్పాటుకు ప్రతిపాదించిన భూములు సాగుచేసుకుంటున్న రైతులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ అన్నారు. మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆమె ఆరు రైతు కుటుంబాలకు చెందిన 11 మందికి ప్రొవిజినల్ అలాట్‌మెంట్ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులంతా పట్టాలు తీసుకుని ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ఎకరాకు 300 గజాల చొప్పున ఇప్పటి వరకు 21 కుటుంబాలకు చెందిన 52 మందికి పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. మిగిలిన రైతులు పట్టుదలకు పోకుండా ఇళ్ల స్థలాల పట్టాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గౌతమ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ వినోద్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

టీటీడీ నుంచి నిధులు ఇప్పించండి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి
కుర్మిద్ద గ్రామస్తుల వినతి


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కుర్మిద్ద గ్రామస్తులు

యాచారం: మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామస్తులు శనివారం ఉదయం నగరంలో కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డిని కలిశారు. గ్రామంలోని రమా సత్యనారాయణస్వామి దేవాలయాన్ని నిర్మిస్తున్నామని ఇందుకు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బందె మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గొట్టె మల్లేశ్, మాజీ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ భద్రతకే కార్డన్ సెర్చ్

శంషాబాద్ డీసీపీ రాజేశ్


సీజ్ చేసిన ద్విచక్రవాహనాలను పరిశీలిస్తున్న డీసీపీ

నందిగామ: సమాజ భద్రత కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని శంషాబాద్ డీసీపీ రాజేశ్ అన్నారు. శనివారం నందిగామ, అంతిరెడ్డిగూడ శివారులోని పృథ్వీకాలనీ, అయ్యప్ప స్వామి దేవాలయం పరిసర ప్రాంతాలలో నందిగామ పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కిరాణా దుకాణాలు, పాన్‌షాపులు, వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శంషాబాద్ డీసీపీ రాజేశ్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో తొమ్మిది హాట్ స్పాట్‌లను గుర్తించి కార్డన్ సెర్చ్ నిర్వహించామని చెప్పారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 42 ద్విచక్రవాహనాలు, నాలుగుచోట్ల గ్యాస్ రీ ఫిల్లింగ్ చేస్తున్నట్లు గుర్తించి 37 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశామన్నారు. నాలుగు బెల్టు షాపుల్లో మద్యం, 8 కేజీల గుట్కా ప్యాకెట్లను, 285 గ్రాముల గంజాయి స్వాధీనం, ఓ పరిశ్రమలో పనిచేస్తున్న బాల కార్మికుడిని గుర్తించామని చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ పూర్ణచందర్, ఏసీపీ శ్రీకాంత్ గౌడ్, ఆరుగురు సీఐలు, పదిమంది ఎస్‌ఐలు, 20మంది ఏఎస్‌ఐలు, 35 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 170 మంది కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను కేంద్రానికి వివరించండి

ఎంపీ ఈటల రాజేందర్‌కు
విశ్రాంత ఉద్యోగుల విజ్ఞప్తి

యాచారం: పెన్షనర్ల సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయీస్, ఉపాధ్యాయ సంఘం నేతలు కోరారు. శనివారం నగరంలోని ఈటల రాజేందర్ నివాసంలో ఎంపీని కలిసి 2025 ఆర్థిక బిల్లుతో పెన్షనర్లకు కలిగే నష్టాలను వివరించారు. బిల్లులో మార్పులు చేపట్టాలని లేదంటే నిలిపివేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ ఈటల రాజేందర్ కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వినోద్‌కుమార్, శ్రీనువాస్, లిక్కి అనురుద్రరెడ్డి, పున్న నర్సింహ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశాంత్ర ఉద్యోగులు

అతివేగమే ప్రాణాలు తీసింది

ఔటర్‌పై ప్రమాదంలో
విచారణ వేగవంతం

- రోడ్డు భద్రతా నియమాలు పాటించని లారీ డ్రైవర్
- కార్లు వెళ్లే మార్గంలో టస్కర్ ప్రయాణం
- వాహనాన్ని సీజ్ చేసిన పోలీసులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రక్కు

ఇబ్రహీంపట్నం రూరల్: బొంగ్లూర్ ఓఆర్‌ఆర్‌పై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం చెందిన విషయం విదితమే. ప్రమాద కారణాలపై ఆదిబట్ల పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారణ వేగవంతం చేశారు. అర్ధరాత్రి జరిగిన ఘటనకు గల కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. మృతులు బాల్‌రాజ్, జనార్దన్, కృష్ణ, భాస్కర్‌రావు, చందూలాల్ అంత్యక్రియలు పూర్తయ్యాయి.

లైన్ మార్చి ప్రయాణం

ఈ ప్రమాదానికి కారణం అతివేగమేనని నిర్ధారణకు వచ్చారు. పెద్దఅంబర్‌పేట్ నుంచి మొయినాబాద్ మండల పరిధిలోని ఎనికేపల్లికి వెళ్లాల్సిన మృతులు ప్రయాణించిన కారు ప్రమాదం జరిగినప్పుడు 130 కిలోమీటర్ల వేగంగా ఉందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఓఆర్‌ఆర్‌పై రెండో లైన్‌లో వెళ్లాలంటే 120 కిలోమీటర్ల వేగం మాత్రమే ఉండాలి. అంతకు మించి వేగం ప్రమాదానికి కారణమైంది.

ట్రక్కును గుర్తించిన పోలీసులు

ప్రమాదం జరిగినప్పుడు కారు లారీని ఢీకొట్టిందని అంచనాకు వచ్చారు. కానీ ఫలానా లారీ అని పోలీసులకు తెలియలేదు. కారు ప్రమాదం జరిగిన చోట లారీ వెనుక బంపర్ పడిపోవడంతో దాన్ని అనుసరించి పోలీసులు దర్యాప్తు చేపట్టి టోల్‌గేట్ల వద్ద సీసీ పుటేజీలు సేకరించారు. శంషాబాద్ మీదుగా షాద్‌నగర్ వైపు వెళ్తున్న భారీ టస్కర్ ప్రమాదానికి కారణమని గుర్తించారు. షాద్‌నగర్ వద్ద ఐరెన్ చిప్స్ లోడ్‌తో వెళ్తున్న టస్కర్‌ను ఆదిబట్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ట్రక్కు బొంగ్లూర్ ఓఆర్ఆర్ మీదుగా 40-50 కిలోమీటర్ల వేగంతో 2వ, మూడవ లైన్ మధ్య నుంచి వెళ్లడంతో కారు ఢీకొట్టినట్లు గుర్తించారు. ట్రక్కులు, క్యాబ్‌లు మూడు, నాల్గవ లైన్లల్లో మాత్రమే వెళ్లాలి. ప్రమాదం జరిగిన వెంటనే ట్రక్కు డ్రైవర్ భయంతో దూరం వెళ్లి వాహనం నిలిపి చూసుకున్నాడని.. ఐదుగురు ప్రాణాలు కోల్పోయినా చలించకపోవడం నేరమని భావించారు. డ్రైవర్‌పై కొత్త చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ట్రక్కును స్వాధీనం చేసుకున్న పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు నేతృత్వంలో త్వరలోనే ట్రక్కు డ్రైవర్‌ను రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిసింది.

ఢిల్లీ సీఎంకు ఆచారి శుభాకాంక్షలు


ఢిల్లీ సీఎం రేఖాగుప్తాతో ఆచారి

కడ్తాల్: జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి శనివారం ఉదయం ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె జన్మదినం సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గంజాయి విక్రేతకు రిమాండ్

శంకర్‌పల్లి: గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ, మోకిల పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మోకిల ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపిన ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన శిషీర్‌నాథ్(28) గతేడాది బతుకుదెరువు కోసం మోకిలకి వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించేందుకు గాను, కొన్ని నెలలుగా గంజాయి అమ్ముతున్నాడు. శిషీర్ నాథ్ తన స్నేహితుడు గోకుల నందనాథ్ ఇద్దరూ కలిసి ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి స్థానికంగా కార్మికులు పనిచేస్తున్న ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. పక్కా సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ, మోకిల పోలీసులు శనివారం దాడి చేయగా.. శిషీర్‌నాథ్ పట్టుబడ్డాడు. ఆయన వద్ద 4.3కిలోల గంజాయి, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. గోకులనందనాథ్ పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

పాము కాటుకు రైతు మృతి


తిరుపతి(ఫైల్)

కడ్తాల్: తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్‌లో పాము కాటుకు యువకుడు మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన యువ రైతు కడారి తిరుపతి యాదవ్ (38) శనివారం సాయంత్రం తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు చెట్ల పొదల్లో ఉన్న పింజర పాము కాటేసింది. వెంటనే బాధితుడు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో ఘటనాస్థలికి చేరుకుని పాముని చంపారు. బాధితుడిని చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్: శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ (రాజేంద్రనగర్) కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌లుగా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు, హిందీ, చరిత్ర, పొలిటికల్ సైన్స్, బోటనీ, జువాలజీ, గణితం, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టుకు, కామర్స్‌లో రెండు పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులు కలిగి ఉండాలి తెలిపారు. ఈ నెల 23న సాయంత్రం సంబంధిత ధ్రువ పత్రాలతో కళాశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రైతులకు మూడింతల పరిహారం

- కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి
- నాగిరెడ్డిపల్లిలో ఐటీ, ఇండస్ట్రియల్ పార్కు కోసం భూ సేకరణ గ్రామసభ

మహేశ్వరం: నాగిరెడ్డిపల్లిలో ఐటీ, ఇండస్ట్రియల్ పార్కు కోసం భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వం మార్కెట్ ధరతో మూడింతల పరిహారం చెల్లిస్తుందని కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో ఐటీ, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోతున్న రైతులతో శనివారం భూసేకరణకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం మండల పరిధిలో ఐటీ, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం సీలింగ్ భూమి 9,10,4849,50,51,53,54,63,66,110,144,162, 163 సర్వే నంబర్లలో మొత్తం 195.5 ఎకరాలు, సర్వే నంబర్ 55,56,57,64,65లో 55.28 ఎకరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. త్వరలో సర్వే చేస్తామని, రైతులు అధికారులకు సహకరించాలన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం తక్కువగా ఉందని మరింత పెంచి ఇవ్వాలని, కుటుంబాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని రైతులు కోరారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, టీజీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

రోడ్డు కబ్జాపై తహసీల్దార్‌కు ఫిర్యాదు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాల్కోనిగుట్ట తండావాసులు

కేశంపేట: మండల పరిధిలోని సంగెం రెవెన్యూ పరిధిలోని పాల్కోనిగుట్ట తండాలో వీవీఆర్ వెంచర్‌లో రోడ్డు కబ్జాకు గురైనట్టు గ్రామస్తులు తహసీల్దార్ అజాంఅలీకి ఫిర్యాదు చేశారు. గతంలో సంగెం రెవెన్యూ పరిధిలో సర్వేనంబర్లు 40, 41, 42, 43, 44లో వ్యవసాయ భూమిని వీవీఆర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారు కొనుగోలు చేసి వెంచర్ వేశారని.. ప్లాట్లు పూర్తి స్థాయిలో అమ్మకాలు జరగకపోవడంతో అట్టి వెంచర్‌లోని ప్లాట్లను మళ్లీ వ్యవసాయభూమిగా విక్రయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంచర్‌లో రోడ్లుతో పాటుగా ఐదుగుంటల భూమిని వదిలేయడంతో పల్లె ప్రకృతి వనం ఏర్పాటుచేశామన్నారు. ప్రస్తుతం వెంచర్ హద్దులను చేరిపివేయడంతో పల్లె ప్రకృతి వనానికి వెళ్లేందుకు రోడ్డు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంచర్‌లోని రోడ్లుతో పాటుగా పల్లె ప్రకృతి వనం రోడ్డును కబ్జా నుంచి తొలగించాలని ఫిర్యాదులో కోరారు. ఈ కార్యక్రమంలో తారాసింగ్, రవి, రాజేష్, సాయికుమార్, శంకర్, శ్రీను, రాజేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ కోసం కృషి చేద్దాం

మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి


ఇబ్రహీంపట్నంలో నడుచుకుంటూ వెళ్తున్న బాలికతో మాట్లాడుతున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: బాలికా శిశు సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, అప్పుడే సమాజం బాగుంటుందని మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలోని రహదారుల వెంట శనివారం పోలీసు బృందంతో కలిసి పర్యటించారు. రోడ్డు వెంట నడుస్తున్న బాలికలను నిలిపి విద్యా బాగోగులు, రక్షణపై ఆరా తీశారు. అనంతరం ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో తనిఖీ చేశారు. విద్యార్థులను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. బాలికల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. బస్టాండ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పోకిరీల బెడద లేకుండా నిరంతరం వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు, బాలికలను వేధింపులకు గురి చేస్తే ఊచలు లెక్కబెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐలు మహేందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, మధు, నందీశ్వర్‌రెడ్డి, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరి నుంచి.. డ్రగ్స్ డాన్‌గా ఎదిగి

- అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్ సందీప్ నేపథ్యమిదీ..
- వందకు పైగా కస్టమర్లతో వాట్సాప్ గ్రూప్
- కోడ్ భాషలతో మేసేజ్‌లు
- ఐటీ ఉద్యోగులే లక్ష్యంగా సరఫరా
- గుట్టురట్టు చేసే పనిలో ఈగల్ టీం

సాక్షి, సిటీబ్యూరో: బీదర్‌లో గొర్రెలు కాపుకాసే వ్యక్తి..హైదరాబాద్‌కు వలస వచ్చి ఏకంగా డ్రగ్స్ డాన్‌గా ఎదిగాడు. తండ్రిని చూసి మాదక ద్రవ్యాలకు బానిసగా మారిన కర్ణాటకకు చెందిన సందీప్ అలియాస్ సందేశ్.. క్రమంగా డ్రగ్స్ పెడ్లర్‌గా ఎదిగాడు. ఇటీవల సైబరాబాద్ నార్కోటిక్ బృందం (ఈగల్) నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్‌లో అంతర్రాష్ట్ర డ్రగ్స్ సరఫరాదారుడు సందీప్ పోలీసులకు చిక్కిన సంగతి తెలిసిందే. సొంతూరులో మూడో తరగతి వరకు చదివిన సందీప్..2006లో ఉపాధి కోసం నగరానికి వలస వచ్చి బాలానగర్‌లోని ఓ హోటల్‌లో పనిలో చేరాడు. సందీప్ తండ్రి బలిరామ్ గంజాయి సేవించేవాడు. ఇదే అలవాటు ఇతడికీ వచ్చిందని పోలీసుల విచారణలో తేలింది. ఇతని వాట్సాప్ గ్రూప్‌లో వందలాది కస్టమర్ల డేటా ఉండటంతో వీరందరి గుట్టురట్టు చేసే పనిలో పడ్డారు.

కస్టమర్లతో వాట్సాప్ గ్రూప్..

జల్సాలు, వ్యసనాలకు బానిసైన సందీప్ అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. మహారాష్ట్రలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. యాకుత్‌పురాకు చెందిన డ్రగ్‌పెడ్లర్ అహ్మద్‌తో ఏర్పడిన పరిచయంతో నగరంలో గంజాయి కొనుగోలుదారుల సమాచారం, ఫోన్ నంబర్లు సేకరించి వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశాడు. ప్రధానంగా ఐటీ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని డ్రగ్స్ సరఫరా చేసేవాడు. మహారాష్ట్ర నుంచి 5 కిలోల మేర ప్యాకెట్లుగా అక్రమ మార్గంలో తీసుచ్చి.. ఒక్కో ప్యాకెట్ (50 గ్రాములు) రూ.3 వేలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకునేవాడు.

'భాయ్..బచ్చా ఆగయా భాయ్'

డ్రగ్స్ సిటీకి చేరగానే వాట్సాప్ గ్రూప్‌లో 'భాయ్..బచ్చా ఆగయా భాయ్' అని సందేశం పోస్టు చేసేవాడు. ఇది చూసి ఫోన్ చేసిన వారికి లోకేషన్ వివరాలు చెప్పేవాడు. ఈ క్రమంలోనే ఈనెల 13న మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకొచ్చి గచ్చిబౌలి లిలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద ఉన్నట్లు సమాచారం ఇచ్చాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఈగల్ బృందం..సందీప్‌ను పట్టుకుంది. అయితే అప్పటికే కస్టమర్లు ఎవరూ లొకేషన్‌కు రాకపోవడంతో పోలీసులే సందీప్ ఫోన్ నుంచి వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయగా అక్కడికి వచ్చిన 14 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరికి డ్రగ్స్ కిట్స్‌తో పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. దీంతో అందర్నీ డీ-అడిక్షన్ కేంద్రానికి తరలించారు. వీరి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని విశ్లేషించగా.. మరో 99 మంది కస్టమర్ల వివరాలు పోలీసులకు చిక్కాయి. దీంతో వీరి పేర్లనూ ఎఫ్‌ఐఆర్‌లో నమోదు చేశారు.